


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 52 | బుధవారం 22 జూలై 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా.. రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారి తీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. - మిగతా2లో

## బ్రిటన్‌లో నూతన శకం.. తొలి ఏఐ మంత్రిగా కనిష్క నారాయణ్

- నూతన ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ కేబినెట్లో ఇద్దరు భారత సంతతికి చోటు
- కనిష్క నారాయణ్‌తో పాటు లీసా నాండీకి మంత్రివర్గంలో చోటు
- వేల్స్ నుంచి ఎంపీగా గెలుపొందిన కనిష్క



## రూ. 5 లక్షల సబ్సిడీతో 10 అంతస్తుల ఫ్లాట్లు.. క్యూర్ పరిధిలో తొలి విడత ఇళ్ల దరఖాస్తులు ప్రారంభం




- హైదరాబాద్ పరిధిలో ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం
- తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్ల నిర్మాణం
- ప్రభుత్వ వాటా రూ. 5 లక్షలు.. లబ్ధిదారుల వాటా రూ. 6 లక్షలు
- జులై 21 నుండి ఆగస్టు 10 వరకు వెబ్‌సైట్, మీ-సేవ ద్వారా దరఖాస్తులకు అవకాశం
- పథకానికి పేరు సూచించి రూ. లక్ష బహుమతి గెలుచుకున్న కొండా నాగరాజు

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధానిని ఆహ్వానించనున్న సీఎం



- ఢిల్లీ పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీకి ఆహ్వానం
- ఆగస్టు 1న అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ప్రారంభం
- హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ


## మంగళగిరిలో ఇచ్చిన ప్రధాన హామీని నెరవేర్చిన మంత్రి లోకేశ్

### 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమంలో 3 వేల మందికి పట్టాల పంపిణీ

- సుమారు రూ.1000 కోట్ల విలువైన భూమికి శాశ్వత హక్కులు
- మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న మంత్రి
- డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి వేగవంతం అవుతుందన్న భరోసా



## క్వాష్ పిటిషన్‌తో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి



- తోటి మహిళా అధికారిణి పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆయన పై ఆరోపణలు
- ఆరోపణలను ఖండించిన ఉదయ్ కృష్ణారెడ్డి
- తమ మధ్య సమ్మతంతోనే సంబంధం ఉందని వాదన
- బుధవారం హైకోర్టులో ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ

## 'సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు'.. కాక్రోచ్ పార్టీ ర్యాలీకి కేటీఆర్ మద్దతు

- విద్యార్థుల పై పోలీసు చర్యలను ఖండించిన కేటీఆర్
- ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉందని వ్యాఖ్య
- విభేదాల గొంతు నొక్కే ప్రయత్నం ఆపాలంటూ కేంద్రానికి చురకలు
- విద్యార్థులకు సంఘీభావం ప్రకటించిన బీఆర్ఎస్ నేత
- ఈ ప్రతిఘటనను పది నెలల క్రితమే ఊహించినట్లు వెల్లడి



VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 22 జూలై 2026

## బ్రిటన్‌లో నూతన శకం.. తొలి ఏఐ మంత్రిగా కనిష్క నారాయణ్

బ్రిటన్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశపు మొట్టమొదటి కృత్రిమ మేధ (ఏఐ) మంత్రిగా భారత మూలాలున్న కనిష్క నారాయణ్‌ను నియమిస్తున్నట్లు నూతన ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ ప్రకటించారు. శరవేగంగా విస్తరిస్తున్న ఏఐ సాంకేతికతలో ప్రపంచస్థాయి అగ్రగామిగా నిలవాలన్న యూకే ప్రభుత్వ లక్ష్యానికి ఈ నియామకం అద్దం పడుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ఏఐతో ముడిపడిన అవకాశాలను, సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఏఐ నియంత్రణ, నైతిక వినియోగం, ఆర్థిక వ్యవస్థతో దాని అనుసంధానం వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టెక్నాలజీ పాలసీ, ఆవిష్కరణల రంగంలో అపార అనుభవం ఉన్న కనిష్క నారాయణ్ నియామకాన్ని ఒక వ్యూహాత్మక అడుగుగా భావిస్తున్నారు. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకుంటూనే, దానితో ముడిపడిన ముప్పులను నివారించడం ఆయన ప్రధాన బాధ్యత కానుంది. కనిష్క వేల్స్ నుంచి ఎంపీగా గెలుపొందారు. ప్రధాని ఆండీ బర్న్‌హామ్ భారత మూలాలున్న ఇద్దరికి తన కేబినెట్లో చోటు కల్పించారు. వారిలో కనిష్క నారాయణ్‌తో పాటు లీసా నాండీ ఉన్నారు. కనిష్క గతంలో కీర్ స్టార్మర్ ప్రభుత్వంలోనూ మంత్రిగా పనిచేశారు. అప్పట్లో ఆన్ లైన్ భద్రత, కృత్రిమ మేధ విభాగాలను పర్యవేక్షించిన ఆయన, ఇప్పుడు పూర్తిస్థాయిలో ఏఐ మంత్రిగా నియమితులయ్యారు. బీహార్‌లో జన్మించిన కనిష్క నారాయణ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన ఆయన, 2025లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇక లీసా నాండీ, కీర్ స్టార్మర్ ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మాంచెస్టర్‌లో జన్మించిన ఆమె తండ్రి దీపక్ నాండీ పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు కాగా, తల్లి బ్రిటన్ జాతీయురాలు. లీసా 2010 నుంచి విగాన్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా.. రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి. చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

## 'సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు'.. కాక్రోచ్ పార్టీ ర్యాలీకి కేటీఆర్ మద్దతు

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. యువత ఆవేదనను పట్టించుకోకపోతే దేశంలో 'జెన్-జెడ్' ఉద్యమం తప్పదని తాను పదినెలల కిందటే చెప్పానని గుర్తుచేశారు. ఢిల్లీలో జరిగిన నిరసనల తర్వాతైనా కేంద్రం జవాబు దారీతనం చూపించి, విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థుల పై పోలీసులు లాఠీఛార్జి చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు కల్పించిందని పేర్కొన్నారు. విభేదాల గొంతు నొక్కే ప్రయత్నాలను కేంద్రం వెంటనే ఆపాలని, జవాబుదారీతనం కోసం పోరాడుతున్న విద్యార్థులకు తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇదే అంశంపై తెలంగాణ కాంగ్రెస్ కూడా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ పాల్గొన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పొన్నం డిమాండ్ చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులకు మద్దతు ప్రకటిస్తూ, పోలీసుల చర్యలను ఖండించారు.

## రూ.5లక్షల సబ్సిడీతో 10 అంతస్తుల ఫ్లాట్లు.. క్యూర్ పరిధిలో తొలి విడత ఇళ్ల దరఖాస్తులు ప్రారంభం

కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని అల్పాదాయ వర్గాల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇండ్లు' పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడతగా గుర్తించిన 16 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా నియోజకవర్గానికి 480 చొప్పున మొత్తం 7,680 ఫ్లాట్లను 10 అంతస్తుల భవనాల్లో నిర్మించనున్నట్లు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఒక్కో ఫ్లాట్ 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండనుండగా, దీని నిర్మాణ వ్యయం రూ. 11 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో రూ. 5 లక్షలను ప్రభుత్వం ఉచిత సబ్సిడీగా ఇవ్వగా, మిగిలిన రూ. 6 లక్షలను లబ్ధిదారులు నాలుగు విడతల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఇళ్లకు జులై 21 నుండి ఆగస్టు 10 వరకు తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్, మీ-సేవ లేదా వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ. 100, ఈఎమ్‌డీ కింద రూ. 10,000 చెల్లించాలి. లాటరీలో ఇల్లు రాని వారికి ఈఎమ్‌డీ సొమ్మును వెంటనే రీఫండ్ చేస్తారు. గత 10 ఏళ్లుగా నగరంలో నివసిస్తూ, సొంత ఇల్లు లేని రూ. 6 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్నవారు మాత్రమే దీనికి అర్హులు. లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చే ఈ ఇళ్లను 10 ఏళ్ల వరకు విక్రయించేందుకు వీల్లేదు. కాగా, ప్రభుత్వం నిర్వహించిన పోటీలో 'ఇందిరమ్మ ఇండ్లు' అనే పేరే బాగుందని, దానినే కొనసాగించాలని సూచించిన నకిరేకల్‌కు చెందిన కొండా నాగరాజుకు మంత్రులు రూ. లక్ష బహుమతి చెక్కును అందజేశారు. వచ్చేఏడు బోనాల నాటికి ఈ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి పేదలకు అందజేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధానిని ఆహ్వానించనున్న సీఎం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. విజయనగరం జిల్లాలోని భోగాపురంలో నూతనంగా నిర్మించిన విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానించనున్నారు. విజయ నగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1వ తేదీన ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఢిల్లీ వెళుతున్నారు. ఈ మేరకు ప్రధానితో భేటీ అయి, ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా కోరనున్నారు. ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా సీఎం చంద్రబాబు కలవనున్నారు. వీరితో పాటు కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, మనోహర్ లాల్ ఖట్టర్, సీఆర్ పాటిల్‌తో కూడా ముఖ్యమంత్రి భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఈ భేటీల్లో చర్చించే వీలుందని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ప్రకారం, బుధవారం ఉదయం 7:30 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు. రోజంతా అధికారిక సమావేశాల్లో పాల్గొని, రాత్రికి ఢిల్లీలోనే బస చేస్తారు. పర్యటన ముగించుకుని గురువారం ఉదయం 10:20 గంటలకు ఆయన తిరిగి రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటారు.

## మంగళగిరిలో ఇచ్చిన ప్రధాన హామీని నెరవేర్చిన మంత్రి లోకేశ్

ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీని నెరవేరుస్తూ, 'బట్టలు పెట్టి పట్టాలిస్తా' అన్న మాటను నిలబెట్టుకున్నానని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరిని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమం కింద మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది పేదలకు శాశ్వత భూహక్కు పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "దశాబ్దాలుగా తమ ఇళ్లు, స్థలాలను ఎవరైనా లాక్కుంటారేమోనన్న భయంతో బతికిన ప్రజలకు ఈ రోజుతో ఆ భయం తొలగిపోయింది. కూటమి ప్రభుత్వం మీకు శాశ్వత హక్కును కల్పిస్తోంది. సుమారు రూ.1000 కోట్ల విలువైన ఈ భూమి ఇకపై మీ సొంతం. అవసరాలకు బ్యాంకులో పెట్టి రుణం కూడా తీసుకోవచ్చు" అని భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని చెప్పానని, ఈ రోజు ఆ హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "కొడుకును గెలిపించుకోలేకపోయావని మా నాన్నను కూడా అవమానించారు. కానీ, ఐదేళ్లు మీ మధ్యే ఉండి మీ మనసు గెలుచుకోవాలని నిర్ణయించుకున్నా. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీలలో ఒకటి ఇచ్చి నన్ను గెలిపించారు. మీరిచ్చిన ఈ బలమే నన్ను ముందుకు నడిపిస్తోంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ అన్నారు. 'రూ.4 వేల పింఛను', 'తల్లికి వందనం', 'అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ' వంటి హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా పూర్తిగా చక్కబడలేదని, రూపాయి ఆదాయానికి రూ.1.40 పైసల ఖర్చు ఉందని, అయినప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీల డబుల్ ఇంజన్ సర్కార్ ఉందని, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని లోకేశ్ పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధుల కేటాయింపు వంటి అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన పవన్ కల్యాణ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని, ఈ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## క్వాష్ పిటిషన్‌తో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో, తీవ్ర వివాదంలో చిక్కుకున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టనుంది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్వీపీఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డిపై ఓ ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణి తీవ్ర ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని, అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతున్నారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, తనపై వివాహేతర సంబంధాలు అంటగడుతూ ప్రచారం చేయడం, ఫోన్‌ను బలవంతంగా లాక్కొని వ్యక్తిగత సందేశాలు చూడటం, ప్రైవేట్ వీడియోలు తీసి వాటిని తన భర్తకు పంపి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను ఉదయ్ కృష్ణారెడ్డి మొదటి నుంచి ఖండిస్తున్నారు. అవన్నీ నిరాధారమైనవని, తామిద్దరం పరస్పర అంగీకారంతో 2025 జూన్ నుంచి రిలేషన్ షిప్ లో ఉన్నామని ఆయన వాదిస్తున్నారు. ఆమెకు వివాహం అయిన తర్వాత కూడా ఈ సంబంధం కొనసాగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని ఆయన సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ ఘటన తర్వాత ఆయన్ను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి, కానిస్టేబుల్‌గా పనిచేసి, పట్టుదలతో సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్ అధికారిగా ఎంపికైన స్ఫూర్తిదాయక నేపథ్యం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు దశలో ఉండగా, పోలీసులు ఇరువర్గాల వాదనలను, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చే తీర్పు కీలకంగా మారనుంది.

## నకిలీ స్టాక్ మార్కెట్ యాప్స్ కేసులో గూగుల్ ఇండియా హెడ్ పై కేసు

- హైదరాబాద్‌లో ముగ్గురు బాధితులు రూ.48 లక్షలకు పైగా నష్టం
- ప్లే స్టోర్‌లోని ఫ్రాడ్ యాప్స్‌ను తొలగించకపోవడమే కారణం
- ఐటీ చట్టం, బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు చేపట్టిన పోలీసులు





హైదరాబాద్‌లో వెలుగుచూసిన భారీ సైబర్ మోసం కేసుల్లో గూగుల్ ఇండియా కంట్రీ హెడ్ ప్రీతి లోబానా పేరును పోలీసులు చేర్చారు. గూగుల్ ప్లే స్టోర్ వేదికగా చలామణి అవుతున్న నకిలీ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల ద్వారా జరిగిన మోసాలకు సంబంధించి నమోదైన మూడు వేర్వేరు కేసుల్లో ఆమెను సహ నిందితురాలిగా పేర్కొంటూ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మోసాల కారణంగా బాధితులు మొత్తం రూ. 48 లక్షలకు పైగా నష్టపోయినట్లు నిర్ధారణ అయింది. ఈ కేసులు జూన్ చివరి వారం నుంచి జూలై మధ్య కాలంలో నమోదయ్యాయి. సంతోష్‌నగర్‌కు చెందిన ఒక 69 ఏళ్ల వృద్ధుడు, ఫేస్‌బుక్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటోతో కూడిన ప్రకటన చూసి మోసపోయారు. వాట్సాప్ ద్వారా పరిచయమైన ఓ మహిళ సూచన మేరకు సదరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రూ.24.37 లక్షలు కోల్పోయారు. అదేవిధంగా, ఆదిభట్లకు చెందిన 40 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగి మరో నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా రూ.17 లక్షలు, ఎర్రగడ్డకు చెందిన 71 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి రూ.7 లక్షలు నష్టపోయారు. ఈ మోసపూరిత యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి తొలగించాలని గూగుల్ సంస్థకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు సైబర్ క్రైమ్ అధికారులు వెల్లడించారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3) ప్రకారం, ప్రభుత్వ ఏజెన్సీలు ఆదేశించినా అక్రమ కంటెంట్‌ను తొలగించడంలో విఫలమైతే సదరు మధ్యవర్తిత్వ సంస్థలు చట్టపరమైన బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ నిబంధన ఆధారంగానే గూగుల్ ఇండియా హెడ్‌పై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ కేసుల్లో ప్రధాన నిందితులతో పాటు ప్రీతి లోబానాపై ఐటీ చట్టం మరియు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద మోసం, ఫోర్జరీ వంటి అభియోగాలతో కేసులు నమోదు చేశారు. ఈ పరిణామాలపై గూగుల్ సంస్థ నుంచి లేదా ప్రీతి లోబానా నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

# మహిళల ఆరోగ్య భద్రతే సఖి హబ్ లక్ష్యం

**-లైఫ్స్ అధ్యక్షులు కలిముల**
**-మహిళల ఆరోగ్య జాగ్రత్తల కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటాం విజయభారతి, సునీత,**

ఆత్మకూరు జులై 21 వార్త సాక్ష్యం





లిటిల్ ఫ్లవర్ ఎడ్యుకేషన్ సొసైటీ (లైఫ్స్) వారి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని , నంద్యాల జిల్లా సఖి హబ్ సమావేశం నిర్వహించారు సమావేశంలో లైఫ్స్ అధ్యక్షులు కలీముల్లా , మార్కాపురం నంద్యాల జిల్లా కోఆర్డినేటర్లు వరం సునీత, విజయ భారతిలు హాజరయ్యారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో. విజయ భారతి మాట్లాడుతూ, "స్త్రీ లేనిదే సృష్టి లేదు" అని పేర్కొంటూ, సృష్టికి మూలమైన మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం సామాజిక సేవా దృక్పథంతో సఖి హబ్ ఉచిత ఆరోగ్య సలహా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. మహిళల ఆరోగ్య భద్రత అత్యంత ముఖ్యమని, ఇంటి ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా సమాజం కూడా ఆరోగ్యవంతంగా మారుతుందని తెలిపారు. సఖి హబ్ కోఆర్డినేటర్లు మహిళలను బృందాలుగా ఏర్పాటు చేసి ఉచిత ఆరోగ్య సలహాలు అందించడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. అలాగే ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేలా మహిళలకు మార్గనిర్దేశం చేస్తున్నట్లు చెప్పారు.మహిళల ఆరోగ్యం, భద్రత, మహిళలు ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల బ్లాక్ కోఆర్డినేటర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రజా పోరాటాలు చేయాలి

**-సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్. ఎం. డి. .రఫీ**

వెలుగోడు జులై 21 వార్త సాక్ష్యం





ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.ఎండి .రఫీ పిలుపునిచ్చారు. సోమవారం వెలుగోడు పట్టణ కేంద్రంలో అఖిలభారత రైతుకుల సంఘం ముఖ్య కార్యకర్త సమావేశం అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు బి . ఆనంద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రఫీ, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు పి. లాజరస్ , అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు బి ఆనంద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. అయితే ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టినా కీలక హామీలు అమలు కాలేదని విమర్శించారు.18 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు నెలకు ?1,500 ఆర్థిక సహాయం, 50 సంవత్సరాలు నిండిన మహిళలకు పింఛన్, ఇంటి స్థలం లేని పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగి ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజలతో కలిసి విస్తృత స్థాయిలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నూతన అఖిల భారత రైతు కూలీ సంఘం వెలుగోడు మండల కమిటీ ఎన్నిక నూతన అధ్యక్షులుగా షేక్ చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శిగా ముబారక్, ఉపాధ్యక్షులుగా రవి, సహాయ కార్యదర్శిగా నాగార్జున కోశాధికారిగా పెద్దక్క మరియు కమిటీ సభ్యులుగా ఏడు మంది ఎన్నుకోవడం జరిగింది ఈ కమిటీ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసేందుకు ఉద్యమం బాటగా సిద్ధంగా ఉంటారని రైతు కూలి సంఘం అధ్యక్షులు బి.ఆనంద్ తెలిపారు

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**-ఎస్ ఎఫ్ ఐ, సీఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**

ఆత్మకూరు జులై 21 వార్త సాక్ష్యం






ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ దీక్ష కు కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు కే దినేష్ కుమార్ సిఐటియు ఆత్మకూర్ పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ ఎస్ఎఫ్ఐ కే సాయికుమార్ లు అన్నారు సోమవారం పట్టణంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు, గౌడ సెంటర్, అంబేద్కర్ విగ్రహం ముందు ర్యాలీ నిర్వహిస్తూ నీట్ పేపర్ లీకేజీ కి భాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సిఐటియు డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గత 21 రోజులుగా డిల్లీ లో సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష కు కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయంలో వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని మండిపడ్డారు.ఒక్క నీట్ పేపర్ వరసగా లీకేజీ అవుతుందని అన్నారు. ఎన్ టి ఏ అసమర్థత స్పష్టంగా కనపడుతున్నది ఇది బీజేపీ జేబు సంస్థలాగా పని చేస్తుందని అన్నారు. ఎన్నో వేల, లక్షల మంది విద్యార్థులు మరియు తల్లిదండ్రుల కలను నిరాశ కలిగించేలా చేశారన్నారు అన్నారు. పేపర్ లీకేజీ వల్ల అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ హత్యలే అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన రాజీనామా చేయాలని నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గత 21 రోజులుగా పర్యావరణవేత్త సామాజిక కార్యకర్త సోనం వాంగ్చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రభుత్వం ఎటువంటి స్పందన లేకపోవడం దారుణం అన్నారు. సోనం వాంగ్ చుక్ కి ఏమి జరిగినా అది కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుంది అన్నారు. ఇప్పటికే సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ప్రమాదకర స్థితిలో ఉన్నదని ప్రభుత్వం స్పందించి ఆయనతో చర్చలు జరపాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని దీనికి ప్రభుత్వం స్పందించి ఆయన దీక్షను విరివింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా మరియు రాష్ట్ర,దేశవ్యాప్తంగా వేల మంది విద్యార్థులతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ఇంటి ముట్టడైన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు అక్మల్, వెంకటేష్, బన్నీ, కైఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డు

**-జిల్లా కలెక్టర్, రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా అందుకున్న షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డు**
**-విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు**
**-తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తాం**
**-ఆత్మకూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న**

ఆత్మకూరు జులై 21 వార్త సాక్ష్యం:




పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా చేతుల మీదుగా సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలో అందించిన షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులను ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అందుకోవడం హర్షించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాలలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం ఉంటుందని విద్యార్థులకు గుర్తు చేశారు తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్న తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వివరించారు కళాశాల నుంచి ముగ్గురు విద్యార్థులు షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులు అందుకుంటూ త్రిబుల్ ఐటీ, నీట్ పరీక్షలతోపాటు ఇతర పరీక్షల్లో పోటీపడి విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ముందుండాలని వివరించారు రాష్ట్రంలో ఆత్మకూరు జూనియర్ కళాశాలకు చదువులో ఇంటర్ ఫలితాలలో మంచి మార్కులు సాధించి షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులు అందుకున్న విద్యార్థులకు తల్లిదండ్రులకు కళాశాల నుంచి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు పేదరికంలో నలుగుతూ కష్టపడి చదివిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించిన జిల్లా కలెక్టర్ కు రాష్ట్ర న్యాయశాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, లకు కళాశాల విద్యార్థులు అధ్యాపకుల నుంచి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు



# ఏ.పీ. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, పై అనుచిత వ్యాఖ్యల దిష్టిబొమ్మ దగ్ధం

**-వైసిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు పై చర్యలు తీసుకోవాలి**
**-జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్**

నందికొట్కూరు జులై 21 వార్త సాక్ష్యం

నందికొట్కూరు పట్టణంలో పటేల్ సెంటర్ లో మంగళవారం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు నాగ సురేష్ మోహన్ ల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర మహిళా హోం మంత్రి వంగల పూడి అనిత ని కించపరిచి రాష్ట్రంలో ఉన్నటువంటి మహిళలందరినీ అవమానించిన వైసిపి మాజీ మంత్రివర్యులు అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు రాష్ట్ర మహిళలు అందరినీ అవమానపరిచినట్లేనని అన్నారు రాష్ట్రంలో ఎక్కడైనా వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులను అడ్డుకుంటామని మండిపడ్డారు ఇంత జరుగుతున్న వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకో లేదంటే అంబటి రాంబాబును ప్రోత్సహిస్తున్నట్లు కనబడుతుందని తెలిపారు వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేసి రాష్ట్ర మహిళలను గౌరవించాలని అన్నారు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులకు మహిళలంటే చులకన భావంతో మాట్లాడుతున్నారని రాష్ట్రంలో ఉన్న మహిళలు అందరినీ అగౌరపరిచి అవమానించినట్లేనని మరొకసారి ఇలాంటి చౌకబారు ప్రకటన చేస్తే సహించమని వారు హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో కుమార్ రాజా, వేణు, వంశీ నవీన్ స్వాములు, వేణు కడియం సంపత్, ప్రకాష్ సామేలు, రమేష్ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థిసంఘం ఆధ్వర్యంలో ఛలో పార్లమెంట్

**-విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషం**




నందికొట్కూరు 21 వార్త సాక్ష్యం

నీట్ పేపర్ లీక్ కు కారకులైన వారిని శిక్షించాలని ఛలో పార్లమెంటుకు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులపై లాఠీ చార్జ్ చేయదని ఖండిస్తూ మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి 200 మంది విద్యార్థులు ర్యాలీగా వచ్చి ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. డిప్యూటీ తహసిల్దార్ పద్మావతి కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పిడి.ఎస్.యు జిల్లా సహాయ కార్యదర్శి కే.ఆది మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన 18 విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, వారి మరణాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనమ్ వాంగ్ చుక్ జంతర్‌మంతర్‌లో నిరాహార దీక్ష చేస్తున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ను అరెస్టు చేసి బలవంతంగా హాస్పటల్ కి తరలించడాని వ్యతిరేకిస్తూ లక్షలాదిమంది విద్యార్థులు శాంతి యుతంగా ఛలో పార్లమెంట్ ముట్టడికి ర్యాలీగా వెళుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ఖండిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు నీట్ పరీక్ష పత్రాలు లీక్ చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను కేంద్ర విద్యా శాఖ మంత్రిగా తొలగించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి రాళ్లు రువ్వడం టియర్ గ్యాస్ ప్రయోగించడం అక్రమ అరెస్టులు చేయడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులపై రౌడీలా ప్రవర్తించిన ఢిల్లీ పోలీసులపై కేసు నమోదు చేసి వారిని తమ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో దేశవ్యాప్తంగా విద్యార్థులందరినీ చలో పార్లమెంట్ కు పిలిపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డివిజన్ నాయకులు అంజి,అజయ్,శివాజీఆది, శ్రీధర్ రాజు, సంతోష్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కలమడుగు వద్ద గోదావరిపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి

**-తెలంగాణ బీసీ జాగృతి సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విజయ్**

జూలై 21 ఉట్నూర్:

జన్నారం మండలంలోని రైతాంగానికి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కలమడుగు వద్ద గోదావరి నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి,గ్రావిటీ కాలువ ద్వారా గుట్టాపూర్--కడెం కాలువలోకి నీటిని తరలించాలని తెలంగాణ బీసీ జాగృతి సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విజయ్ ప్రభుత్వాన్ని కోరారు.మంగళవారం జన్నారం మండలంలో నిర్వహించిన బహుజన బీసీ వాదుల తేనీటి విందు సమావేశంలో ఆయన మాట్లాడుతూ,జన్నారం మండలం గత 70 ఏళ్లుగా మెట్ట ప్రాంతంగా ఉండటంతో పాటు అటవీ ప్రాంతం అధికంగా ఉండడం, సారవంతమైన భూములు తక్కువగా ఉండడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.కడెం ప్రాజెక్టు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో కాలువల ద్వారా చెరువులకు నీరు చేరే పరిస్థితి గత కొన్నేళ్లుగా సరిగా లేదని తెలిపారు.ఉపాధి హామీ పథకం కింద కలమడుగు వద్ద గోదావరిపై రివెట్‌మెంట్‌తో భారీ కరకట్ట నిర్మిస్తే బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు, కలమడుగు వాగుల్లో నీటి నిల్వ పెరిగి,దిగువ ప్రాంతాలకు వెళ్లే సుమారు 70 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 22 జూలై 2026

## ఎంబిబిఎస్ నీట్ ప్రవేశ పరీక్షలో కురుకుంద విద్యార్థి ప్రతిభ

ఆత్మకూరు జులై 21 వార్త సాక్ష్యం



నీట్ పరీక్షలో ఎంబిబిఎస్ సీటు526 మార్కులతో ర్యాంకు సాధించిన మంగళవారం మండల పరిధిలోని కురుకుంద గ్రామానికి చెందిన సి . ఆసిఫ్ తండ్రి సి . జబియుల్లా కుమారుడు జాతీయ స్థాయి నీట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. నీట్ ప్రవేశ పరీక్షలో 720 మార్కులకు గాను 526 మార్కులు సాధించారు. అలాగే ఆల్ ఇండియా నీట్ ర్యాంక్ 59,425తో పాటు

**కేటగిరీ ర్యాంక్ 7,496ను పొందారు.**

ఈ సందర్భంగా విద్యార్థి ప్రతిభను గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, స్నేహితులు మరియు గ్రామస్తులు అభినందించారు. ఈ విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు సి . జబివుల్లా మరియు ఆస్మా ని కూడా పలువురు ప్రశంసించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించిన ఆసిఫ్ భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మంచి డాక్టర్ గా మరిన్ని విజయాలు సాధించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు

## బైర్లూటి గురుకుల పాఠశాల బాలికలకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

**-జవహర్ నాయక్ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు**



ఆత్మకూరు జులై 21 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని బైర్లూటి బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో బాలికలకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు జవహర్ నాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు జవహర్ నాయక్ మాట్లాడుతూ గత రెండు వారాల నుంచి బాలికలకు పాలు ఇవ్వటం లేదనీ, గత రెండు వారాల నుంచి బాలికలకు చికెన్ పెట్టడం లేదనీ, పాఠశాల ప్రిన్సిపాల్ స్థానికంగా ఉండటం లేదనీ, బాలికలకు స్టడీ అవర్స్ సక్రమంగా నిర్వహించటం లేదనీ అన్నారు. పాఠశాలలో పనిచేసే పురుష ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేయాలన్నారు. కావునా సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని మీడియా ద్వారా విన్నపించారు.

కనీస వేతనాల పెంపుకై

## జులై 30, 31న చలో కలెక్టరేట్ సీఐటీయు



ఆత్మకూరు జూలై 21 వార్త సాక్ష్యం

కార్మికుల కనీస వేతనాల పెంపుకై జులై 30, 31న చలో కలెక్టరేట్ చేపట్టడం జరుగుతుందని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ లు అన్నారు. మంగళవారం పట్టణంలో కనీస వేతనాల పెంపు పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 71 షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాలు పెంచాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలి, పని ప్రదేశాల్లో భద్రత చర్యలు చేపట్టాలన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలి, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. అంగన్వాడి, ఆశా, మధ్యాహ్న భోజనం, వెలుగు, సమగ్ర శిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ, 108, 104, తల్లి బిడ్డ, ఆరోగ్య/మిత్ర, అర్బన్ హెల్తు, ఆయుష్ తదితర ప్రభుత్వ పథకాల ఉద్యోగులుగా గుర్తించాలి, వేతనాలు పెంచాలన్నారు. ఔట్సోర్సింగ్, ఆప్కాస్ ప్రభుత్వ రంగ, స్థానిక సంస్థల పథకాల కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికై జులై 30, 31న చేపట్టే నంద్యాల కలెక్టరేట్ ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య, గోపాల్, నాగాంజ నేయులు, మల్లికార్జున, వెంకటేశ్వర్లు నాయక్, శ్రీధర్, బాలాజీ, ప్రశాంత్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆస్తుల భద్రతకు ముప్పు కలిగించే జీవో నెం. 396ను వెంటనే రద్దు చేయాలి

**-ఆత్మకూరు దస్తావేజు లేఖరుల నిరవారిదిక సమ్మె**

ఆత్మకూరు జులై 21 వార్త సాక్ష్యం





ప్రజల స్థిర ఆస్తుల భద్రతకు భంగం కలిగించే ఉన్న జీవో నెం. 396ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని స్టాంప్ రైటర్ల సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు దస్తావేజుల లేఖరులు నిరవధిక సమ్మె కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, స్టాంపు రైటర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కొన్ని సేవలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధంగా ప్రభుత్వం జీవో నెం. 396ను తీసుకువచ్చిందని, దీనివల్ల ప్రజల, రైతుల ఆస్తుల వ్యవహారాల్లో ప్రభుత్వ ప్రత్యక్ష బాధ్యత తగ్గి, భవిష్యత్తులో ఆస్తుల భద్రతపై అనుమానాలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ప్రారంభమైన నాటి నుంచి స్టాంప్ రైటర్లు ప్రజలకు, రైతులకు వారధిగా నిలిచి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలందిస్తున్నారని తెలిపారు. అలాంటి పారదర్శకమైన వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదన్నారు. ఉద్యోగ అవకాశాలు లేక డిగ్రీ, పీజీ విద్య పూర్తి చేసిన అనేక మంది యువకులు జీవనోపాధిగా స్టాంప్ రైటర్ వృత్తిని ఎంచుకున్నారని, వీరి వల్ల ప్రభుత్వంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడదని పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టడం బాధాకరమని అన్నారు. జీవో నెం. 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 12 రోజులపాటు పెన్‌డౌన్ ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జీవోను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టాంప్ రైటర్లు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## చైతన్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో శుభ్రత, పరిశుభ్రత పై అవగాహన సదస్సు





**-"పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది"**
**-ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బేబీ**
**-విద్యార్థులకు క్రమశిక్షణ పరిశుభ్రత ఎంతో ముఖ్యం**
**-ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఏ. షహవుద్దీన్**

ఆత్మకూరు జులై 21 వార్త సాక్ష్యం

పట్టణంలోని పెద్ద కబేలా వీధిలో చైతన్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు " ఎస్ ఏ, ఎస్ఏ. కార్యక్రమంలో భాగంగా శుభ్రత మరియు పరిశుభ్రత పై అవగాహన సదస్సు కార్యక్రమం" నిర్వహించారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత ఆరోగ్యం, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బేబీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అలాగే ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ షహబుద్దీన్ ప్రత్యేక అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో

**మున్సిపల్ కమిషనర్ బేబీ మాట్లాడుతూ,**

"పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వం లేదా మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడు తన ఇంటిని, పాఠశాలను, వీధిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది అని చిన్న అలవాట్లు పెద్ద మార్పులకు నాంది పలుకుతాయని, చెత్తను చెత్తబుట్టలో వేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి కర్తవ్యం" అని పేర్కొన్నారు.

**సింగిల్ విండో చైర్మన్ షహబుద్దీన్...మాట్లాడుతూ**

, ఈనాటి విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాతలని పరిశుభ్రతను జీవితంలో ఒక అలవాటుగా మార్చుకుంటే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని ప్రతి విద్యార్థి తన కుటుంబానికి, తన గ్రామానికి పరిశుభ్రత రాయబారిగా మారాలని మనం చేసే చిన్న మార్పు దేశాన్ని గొప్ప మార్పు వైపు నడిపిస్తుందని విద్యార్థులను ఉత్తేజపరిచారు.

**పాఠశాల కరెస్పాండెంట్ తాజుద్దీన్ మాట్లాడుతూ,**

"విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాదని మంచి అలవాట్లు, పరిశుభ్రత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత కూడా విద్యలో భాగమేనని ప్రతి విద్యార్థి తన పాఠశాలనే మాత్రమే కాకుండ తమ ఇంటిని, తమ వీధిని కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ముందుండాలని పరిశుభ్రతతో ఆరోగ్యం, ఆరోగ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుంది" అని తెలియజేశారు. మున్సిపల్ కమీషనర్ బేబీ స్వచ్ఛ ఆంధ్ర మరియు స్వచ్ఛ ఆత్మకూరు అని పరిశుభ్రత పై ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు,పరిసరాల పరిశుభ్రత, ప్రతి ఒక్కరి బాధ్యత,ఒక్కటే మాట, పరిశుభ్రత బాట.పరిసరాలు పరిశుభ్రం,రోగాలకు బహు దూరం.వేయకు చెత్త చేయకు పాపం.అపరిశుభ్రత నివారిద్దాం వ్యాధులను నిరోధిద్దాం పచ్చదనం, పరిశుభ్రం ప్రగతికి సోపానం.ఇంటింటా మరుగుదొడ్డి,ఊరంతా ఆరోగ్యం.చెత్తని రోడ్లపై వేయకండి, డ్రైన్లను చెత్తతో మూసివేయకండి అంటూ పాఠశాల విద్యార్థులకు ప్రతిజ్ఞ చేయించారు,పాఠశాల పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది కలిసి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. చెత్తను తొలగించి పరిశుభ్రత పాటించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెత్తను తడి--పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, మొక్కలు నాటడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న అధికారులు మరియు పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించి, పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమం విజయవంతం చేయడంతో విద్యార్థులకు విద్యార్థులకు తల్లిదండ్రులకు పాఠశాల సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఓబులేసు, జీవన్ కుమార్, రఫీక్, మహె జబీన్, రాఘవ, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు..!?

**-నంద్యాల జిల్లా కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి**

నంద్యాల జులై 21 వార్త సాక్ష్యం





కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందంటూ మంగళవారం నంద్యాల పట్టణంలో వైసీపీ పార్టీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమానికి వైసీపీ ముఖ్య నేతలు ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు మహిళలకు మద్దతుగా ఎమ్మెల్సీ ఇస్సాకు భాష పూర్తిగా తమ మద్దతును తెలిపారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. వివిధ జిల్లాల్లో మహిళలపై దాడులు, వేధింపులు మరియు అఘాయిత్యాలు పెరిగాయని, బాధితులకు తక్షణ న్యాయం జరగడం లేదని విమర్శించారు. పోలీస్ వ్యవస్థ ప్రజా రక్షణ మరియు మహిళల భద్రతపై దృష్టి సారించకుండా, 'రెడ్ బుక్ పాలన' పేరుతో రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యం ఇస్తోందని, ఫలితంగా నేరస్థుల్లో భయం లేకుండా పోయిందని విమర్శించారు. బాధిత మహిళలకు న్యాయం చేయాలని, నిందితులపై ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి పాలనలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. వేర్వేరు సందర్భాల్లో కొన్ని నిర్దిష్ట సంఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. గుంటూరు అమానుష సంఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర హోంమంత్రి తక్షణమే రాజీనామా చేసి, బాధిత మహిళలకు, వారి కుటుంబాలకు సీఎం చంద్రబాబు నాయుడు బహిరంగ క్షమాపణ చెప్పాలని చెప్పారు. నిందితులను కేవలం పార్టీ నుండి సస్పెండ్ చేసి చేతులు దులుపుకోకుండా, చట్టపరంగా తీవ్ర చర్యలు తీసుకొని , ఫిర్యాదులపై స్పందించడంలో జాప్యం చేసిన, కేసును 'పంచాయతీ' చేసి నీరుగార్చడానికి ప్రయత్నించిన పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. స్టేషన్లకు వెళ్లి రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తూ బాధితులను బెదిరించే అధికార టిడిపి నాయకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరిగిన అకృత్యాల కేసులన్నింటినీ ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు పంపి, త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ఎందుకు చొరవ తీసుకుంటలేదని ప్రశ్నించారు. కావలిలో జరిగిన గిరిజన మహిళ ఘటనతో పాటు, అధికార పార్టీ నాయకులపై వచ్చిన తీవ్రమైన ఫిర్యాదులపై హైకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో నిష్పాక్షిక విచారణ జరిపించి న్యాయం చేయకపోతే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో, వైస్సార్సీపీ మహిళా జోనల్ ప్రెసిడెంట్ గాజుల శ్వేతారెడ్డి , నంద్యాల అసెంబ్లీ పరిశీలకులు సద్దల సూర్యనారాయణ రెడ్డి , జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మ,రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుమంత్ రెడ్డి మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# ప్రతి ఓటును కీలకంగా భావించాలి





**-ఎస్ ఐ ఆర్ ను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి**
**-ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**
**-కట్టంగూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం**

వార్త సాక్ష్యం కట్టంగూర్, జూలై 21:

కీలకంగా భావించి ఓటర్ జాబితా సవరణలు అర్హులైన ఓటరు పేరును ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని ప్రభుత్వ వైపు నకిరేకల్ శాసనసభ్యులు వీరేశం అన్నారు. కట్టంగూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ నూతన పార్టీ కార్యాలయ ప్రారంభంతో మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు మరింత ఉత్సాహంగా, వేగవంతంగా ముందుకుసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని బిఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. మండలం లోని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణను ఆషామాషీగా భావించకుండా పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో నకిరేకల్ నియోజకవర్గ యస్ఐఆర్ కోఆర్డినేటర్ మువ్వా విజయ్ బాబు, ఈఆర్ఓ లెవల్ కోఆర్డినేటర్ చామల శ్రీనివాస్, కట్టంగూర్ మాజీ జెడ్పిటిసి మాద యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరబోయిన వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పెద్ది సుక్కయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చింత వెంకటనర్సయ్య, బచ్చుపల్లి గంగాధర్ రావు, నకిరేకల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గుండు పరమేష్ గౌడ్, బండారు కృష్ణ, సర్పంచులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కొలిపాక సురేందర్ గౌడ్, గుల్లి నరేష్, సుంకరబోయిన సంధ్యవెంకన్న, తోటకూరి జలజా యాదయ్య, కురిమిళ్ళ మల్లేష్, దార సత్తమ్మబిక్షం, మాద మమత సైదులుగౌడ్, సత్య నారాయణ, రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గద్దపాటి దానయ్య, అయితగోని నారాయణ, మిట్టపల్లి శివశంకర్, బుచ్చాల వెంకన్నగౌడ్, గుండు రాంబాబుగౌడ్, రెడ్డిపల్లి వీరస్వామి, ఐతగోని సైదులు గౌడ్, కానుగు శ్రీను, ఐతగోని మల్లికార్జున్ గౌడ్, కానుగు శ్రీను, మైనం అంబేద్కర్, మేడి విజయ్, కోలా భోలేషావలీ బాబా, వీరితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, బిఎల్ఓలు, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వీరేషానికి ఘన స్వాగతం**

ప్రభుత్వవిప్ వేముల వీరేషానికి క్యాబినెట్ స్థాయి కల్పించిన తర్వాత మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి క్యాబినెట్ అవగాహన ఆయన హాజరు కావడంతో మండల అంతా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలతో ముంచెత్తారు. క్యాబినెట్ ర్యాంకు రావడం ద్వారా నకిరేకల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చందేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇందిరానగర్ లోని అన్ని వీధులలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి

**-కెవిపిఎస్ డిమాండ్**




ఆత్మకూరు జూలై 21 వార్త సాక్ష్యం

పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో మూడు వార్డుల ప్రజలు నివాసముంటున్న అన్ని వీధులలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేక ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు ఏ. రణధీర్, కార్యదర్శి డి. రామ్ నాయక్, పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఏ.సురేంద్ర లు అన్నారు.మంగళవారం పట్టణంలోని ఇంద్రానగర్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగిందని అన్నారు ఎమ్మని చెన్నయ్య ఇంటి నుంచి నర్సింలు ఇంటి వరకు, నర్సింహులు ఇంటి నుంచి జంగాల పెద్ద కాషాయం ఇంటి వరకు, నర్సింహులు ఇంటి నుంచి మార్కు ఇంటి వరకు, విజయ కుమారి ఇంటి నుంచి అభిషేకమ్మ ఇంటి వరకు, సుజానమ్మ ఇంటి నుంచి జయమ్మ ఇంటి వరకు, జయలక్ష్మి ఇంటి నుంచి లలితమ్మ ఇంటి వరకు, సిమెంట్ రోడ్లు వేసి, ఇంద్రానగర్ లోని అన్ని సందులకు డ్రైనేజీ సిస్టం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంద్రానగర్ కాలనీ ఏర్పాటు దాదాపు 30 సంవత్సరాలు దాటుతున్న ఆ కాలనీలోని పలు వీధులలో సిమెంట్ రోడ్లు లేక చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచి బురద మయంగా మారుతున్నాయని వేసవికాలంలో రోడ్లపై గుంతలు ఏర్పడి కాలనీ ప్రజలు నడవాలన్నా రోడ్లపై తిరగాలన్న ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వచ్చాయి కావాలా ఇంద్రానగర్ లో అన్ని ఏరియాలలో సిసి రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తామని అధికారులు ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా చెప్తున్నారు తప్ప ఆచరణలో ఈ రోడ్లు చూస్తే ఎస్సీ ఎస్టీ సప్లై నిధులు ఖర్చు చేశారో అర్థం అవుతుందన్నారు. స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న నేటికీ దళిత కాలనీలో అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు.వెంటనే ఇంద్ర నగర్ లోని అన్ని సందులలో సిమెంట్ రోడ్లు వేసి డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఇంద్రా నగర్ కాలనీప్రజలు ,భారతి,విజమ్మ, శేఖర్,శీలయ్య,చెన్నయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారుల రోడ్డు ప్రమాదాలపై సమన్వయంతో చర్యలు చేపట్టాలి

**-రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్**
**-జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి**

వార్త సాక్ష్యం జూలై 21 జగిత్యాల:



జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమర్థవంతమైన రోడ్డు భద్రత చర్యలు అమలు చేయాలని రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి జాతీయ రహదారులపై రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కాన్ఫరన్స్ కు సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ రోడ్డు భద్రతను పెంపొందిం చడం,రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇప్పటివరకు బీహార్,కర్ణాటక,పుదుచ్చేరి రాష్ట్రాలు మాత్రమే సుప్రీంకోర్టుకు అనుసరణ నివేదికలు సమర్పించాయని, మిగిలిన రాష్ట్రాలు కూడా త్వరితగతిన చర్యలు తీసుకొని నివేదికలు పంపాలని సూచించారు. జాతీయ రహదారులపై అనధికారిక పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని, పెట్రోలింగ్ వాహనాల నిర్వహణను బలోపేతం చేయడంతో పాటు భారీ వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ స్థలాలను జాతీయ రహదారుల సమీపంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జాతీయ రహదారుల అధికారులు, పోలీసు శాఖ,సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రులను మ్యాపింగ్ చేసి అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జాతీయ రహదారుల పక్కన కొత్తగా మద్యం దుకాణాలకు ఎలాంటి లైసెన్సులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు.జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర కార్యాచరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.రోడ్డు భద్రత అంశాన్ని సుప్రీంకోర్టు అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోందని,ఈ ప్రక్రియలో అవసరమైన అన్ని శాఖల సమన్వయం,పోలీసు సహకారం అందేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని అనుసరణ నివేదికలను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రవాణా శాఖ అధికారి సంధాని ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీశైలం జూలై 21 వార్త సాక్ష్యం




దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో నిత్యకళారాధన కార్యక్రమంలో ఉష బృందం, ఖమ్మం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.
మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన .ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, మూషికవాహన, శివాష్టకం, శంభో...శివశంభో, పార్వతీ కృపాకరి తదితర గీతాలకు చైత్ర, పూర్ణిమ, అమృత, ప్రణన్య, ఉష, భవిష్య, హేమ తదితరులు నృత్యప్రదర్శన చేశారు ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

# వికలాంగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి:గిద్దె రాజేష్

**-జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్**

వార్త సాక్ష్యం జూలై 21 హైదరాబాద్:

రాష్ట్రంలో వికలాంగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మలక్‌పేటలోని రాష్ట్ర వికలాంగుల డైరెక్టర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. వికలాంగుల పింఛన్‌ను



రూ.6 వేలుకు పెంచడం,ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం,వికలాంగుల అట్రాసిటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడం,బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయడం, వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయడం వంటి హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా జనాభా ప్రాతిపదికన వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.
వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. అలాగే వికలాంగుల హక్కుల చట్టం--2016 కు అనుగుణంగా రాష్ట్ర వికలాంగుల కమిషనర్‌గా అర్హత కలిగిన వికలాంగుడినే నియమించాలని విజ్ఞప్తి చేశారు.వికలాంగులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన గిద్దె రాజేష్, సమస్యల పరిష్కారంలో పురోగతి లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకులు బండి శ్రీనివాస్,వీరస్వామి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
బుధవారం 22 జూలై 2026

# 12 ఏళ్ల బీజేపీ ఏలుబడిలో 152 పేపర్ లీకేజీలు?ఏళ్ల తరబడి పరీక్షపత్రాల లీకేజీ







జులై 21 వార్త సాక్ష్యం

బీజేపీ వ్యంగ్య రూపంలో ఏర్పడినప్పటికీ ఏళ్ల తరబడి పరీక్షపత్రాల లీకేజీ నేపథ్యం లో నీట్ 2026 పేపర్ లీకేజీతో ఉద్యమరూపాన్ని సంతరించుకున్నది. వాస్తవానికి దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 152 పేపర్ లీకేజీ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ లీకేజీల మూలంగా లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఒత్తిడి, మానసిక క్షోభకు గురయ్యారు. కొందరైతే ఆత్మహత్యలకు పాల్పడి తమ విలువైన ప్రాణాలను కోల్పోయారు.

**అయినా కఠిన చర్యలు, చట్టాలు తేలేదు**

దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో పేపర్ లీకేజీలు జరుగుతునే ఉన్నాయి. ఒక్క సంవత్సరం రెండు సంవత్సరాలు కాదు ప్రతి సంవత్సరం ఇదొక తంతుగా మారింది. అయినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రాలలోని బీజేపీ ప్రభుత్వాలు కఠిన చర్యలకు దిగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లీకేజీలకు కారణమైన వారిపై కేసులు పెట్టడం, ఆ తరువాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. కోట్లాది మంది విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలో ఆటలాడుకుంటున్నారు. తాజాగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా కాక్రోచ్ జనతా పార్టీ అనే పేరుతో యువత పెద్ద ఎత్తున నిరసన దీక్షలు చేపట్టారు. ప్రముఖ సామాజిక వేత్త, విద్యావేత్త, పరిశోధకుడు సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్షతో దేశంలోని యువత రగిలిపోతున్నది. వాంగ్‌చుక్‌ను హాస్పిటల్‌కు బలవంతంగా తరలించినా ఉద్యమం ఆగలేదు. సోమవారం పార్లమెంటు వద్దకు యువత నిరసనగా బయల్దేరడంతో పోలీసులు తీవ్ర దమనకాండకు దిగారు. సీజేపీ ప్రతినిధులు కేంద్ర మంత్రిని కలువగలిగినప్పటికీ కనీస హామీ కూడా లభించలేదు. సీబీఎస్ఈ 12వ తరగతి మూల్యాంకనం కారణంగా లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారు. తక్కువ మార్కులు వచ్చాయని గగ్గోలు పెట్టినా ఆన్ లైన్ మూల్యాంకనం నిర్వహించిన బ్లాక్ లిస్టెడ్ కంపెనీ పై ఇంత వరకు చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్వంత రాష్ట్రం అయిన గుజరాత్ లో గత 12 సంవత్సరాలలో 11 పేపర్ లీకేజీ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ రాష్ట్రంలో గత రెండు దశాబ్దాలకు పైగా బీజేపీ ప్రభుత్వం కొనసాగుతున్నది. తలతి (2015), తలతి (2016), టీఏటీ (2018), ముఖ్య సేవిక (2018), నయాబ్ చిట్నీస్ (2018), లోక్ రక్షక్ దళ్ (2018), క్లర్క్ (2019), జీఎస్ఎస్ఎస్బీ హెడ్ క్లర్క్ (2021), బీ.కామ్ ఫైనల్ ఇయర్ (2021), ఫారెస్టు గార్డు (2022), జూనియర్ క్లర్క్ (2023) పరీక్షా ప్రశ్న పత్రాలు బహిరంగ మార్కెట్ లో లభ్యమయ్యాయి. సోషల్ మీడియా ఖాతాల్లో ప్రశ్న పత్రాలు చక్కర్లు కొట్టాయి. పేపర్ లీకేజీ కోసం ప్రత్యేకంగా ఖాతాలు నిర్వహించి కోట్ల రూపాయలు అమాయకులైన విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి సొమ్ము చేసుకున్నరంటే దళారులు ఎంతగా బరితెగించారనేది స్పష్టమవుతున్నది. ఇన్ని లీకేజీలు జరుగుతున్న కట్టడి చేయడంలో గుజరాత్ లోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తోంది

**మధ్యప్రదేశ్ రాష్ట్రంలో వ్యా పంకుంభకోణం45 మరణాలు?**

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వాలే కొన్నేళ్లుగా కొనసాగుతున్నాయి. 2014 లో ఎంపీ బోర్డు 12వ తరతగతి మ్యాథ్స్, 2023లో ఎంపీ పట్వారీ, 2023 లో ఎంపీ బోర్డు 12వ తరగతి, 2023 లో ఎన్.హెచ్.ఎం కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ ఎగ్జామ్, 2023 లో బర్కతుల్లా యూనివర్సిటీ బీబీఏ ఎగ్జామ్, 2024 లో డీఏవీవీ ఎంబీఏ సెమిస్టర్ పరీక్షల ప్రశ్న పత్రాలు అంగట్లో సరుకులుగా మారాయి. కొన్ని సంవత్సరాల పాటు వ్యాపం కుంభకోణం పేరు దేశ వ్యాప్తంగా మరుమోగింది. శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వ హయాంలో వ్యసాయిక్ పరీక్షా మండలం (వ్యాపం) అనే స్వయం ప్రతిపత్తి ప్రభుత్వ సంస్థ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల పరీక్షతో పాటు ప్రవేశ పరీక్షలు కూడా నిర్వహించారు. వైద్య విద్య ప్రవేశానికి సంబంధించిన ఈ పరీక్ష పెద్ద కుంభకోణంగా ఇప్పటికీ చెబుతుంటారు. ఇందులో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, వ్యాపార వేత్తలు భాగస్వామ్యం అయి లక్షలాది మంది విద్యార్థుల ఉసురు పోసుకున్నారు. అనర్హులు అయిన వారు దళారులు, రాజకీయ నాయకులు, వ్యాపం ఉద్యోగులకు భారీగా లంచాల ఆశచూపి ఉత్తమమైన ర్యాంకులు తెచ్చుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ కుంభకోణం బట్టబయలు అయ్యింది.

ఈ కుంభకోణంలో అప్పటి విద్యాశాఖ మంత్రి లక్ష్మీకాంత్ శర్మ, ఆయన ఆధీనంలో పనిచేసే ఓ పీ శుక్లా, సుధీర్ శర్మ, ఆర్ కే శివహరే, రవికాంత్ ద్వివేది ఉన్నారు. ఇవ కాకుండా కట్నీ హవాలా, డబ్ల్యూసీడీ అంగన్ వాడీ కుంభకోణాలు కూడా జరిగాయి. వ్యాపం కుంభకోణం విలువ అక్షరాలా రూ.10వేల కోట్ల వరకు ఉంటుందని, దీనికి బాధ్యులైన వారిలో 45 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు కాని ఇంత వరకు ఒక్కరినీ కూడా జైలులో వేయలేదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలో జరిగిన కుంభకోణంలో నకిలీ అంగన్ వాడీలు, లబ్ధిదారులను సృష్టించారు. 2013 లో ఈ కుంభకోణం బయటకు రాక ముందే ఇందులో భాగస్వామ్యులుగా, పాత్రదారులు గా ఉన్నవారు అనుమానాస్పదంగా మరణించారు. 2015 వరకు వ్యాపం కేసుకు సంబంధించి 32 మంది చనిపోగా, మీడియాకు అందిన సమాచారం ప్రకారం నలభై మంది వరకు అనుమానాస్పద స్థితిలో చనిపోయారు. చాలా కేసుల్లో సరైన ఆధారాలు లేకపోవడం మూలంగా వాటిని పోలీసులు ఈ కేసులను మూసివేశారు. 2013 లో వ్యాపం కింద నిర్వహించిన 27 వేర్వేరు పరీక్షలలో దాదాపు 20 లక్షల మంది వరకు హాజరయ్యారు. ఈ సంఖ్య ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ జనాభాకు సమానం. అసలు అభ్యర్థికి బదులుగా మరొకరు పరీక్షలు రాయడం, రోల్ నెంబర్ తారు మారు చేయడం, మార్కుల షీటును ట్యాంపర్ చేయడం వంటివి జరిగాయి. అసలు అభ్యర్థులకు బదులుగా ఇతరులు మోసపూరితంగా పరీక్షలకు హాజరయ్యారు. నకిలీ అభ్యర్థులు పరీక్షలు రాసేలా నిర్వహాకులు ఏర్పాట్లు చేశారు. ఇంజిన్ బోగీ సిస్టమ్ అనగా ఒక అభ్యర్థి పక్కన మరొక నకిలీ అభ్యర్థి వచ్చేలా రోల్ సెంబర్ల విధానాన్ని అనుసరించారు. పరస్పరం మాట్లాడుకుని జవాబు పత్రాన్ని నింపుకుంటారు. జవాబు పత్రంలో సహాధానాలు రాయకుండా ఉద్ధశపూర్వకంగా ఖాళీగా పెట్టి, వాటిని స్ట్రాంగ్ రూమ్ కు తరలించిన తరువాత జవాబులతో నింపుతారు. ఆ తరువాత కంప్యూటర్ లోని మార్కుల షీట్లను తారుమారు చేసి అత్యధిక మార్కులు వచ్చేలా చూస్తారు. 2016 సంవత్సరంలో సీబీఐ దర్యాప్తును అడ్డుకునేందుకు సీబీఐ ప్రత్యేక కోర్టులో దాఖలు చేస్తున్న పిటిషన్లను ఎప్పటికప్పుడు అడ్డుకునేందుకు మధ్యప్రదేశ్ లోని అప్పటి బీజేపీ ప్రభుత్వం రూ.1.25 కోట్ల వరకు ఖర్చు పెట్టిందని అంచనా. వ్యాపం కుంభకోనంలో సీబీఐ 86 మందిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసినా ఇప్పటి వరకు ఒక్కరు కూడా జైలుకు వెళ్లకపోవడం గమనార్హం.

**ఉత్తరప్రదేశ్‌లో ఆదిత్యనాథ్ పాలనలో కూడా నిరాటంకంగా లీకేజీలు?**

ఉత్తరప్రదేశ్‌లో ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో కూడా లీకేజీలు నిరాటంకంగా జరుగుతునే ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2014లో సీపీఎంటీ, 2015 లో యూపీపీసీఎస్ ప్రిలిమ్స్, 2016లో యూపీ పాలిటెక్నిక్, 2017లో పోలీసు ఇన్ స్పెక్టర్, 2021లో యూపీ టీచర్ అర్హత పరీక్ష, 2021 లో యూపీ ప్రిలిమినరీ అర్హత పరీక్ష, 2022 యూపీ 12వ బోర్డు ఇంగ్లీషు పరీక్ష, 2024 లో యూపీపీఎస్సీ ఆర్ఓ, ఏఆర్ఓ, 2024 లో యూపీ పోలీసు కానిస్టేబుల్ పరీక్షల ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. 2024 లో జరిగిన పోలీసు కానిస్టేబు రిక్రూట్ మెంట్ పరీక్షకు 48 లక్షల మంది హాజరు కాగా, ప్రశ్నపత్రం లీక్ కావడం ప్రభుత్వం రద్ధు చేసింది. జవాబు కీ లకు సంబంధించి గుజరాత్ తో బలమైన సంబంధం కలిగి ఉన్నట్లు వెల్లడి అయ్యింది. ఈ పశ్న పత్రాలను గుజరాత్ లో ముద్రించగా, ట్రాన్స్ పోర్టు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను రవాణా చేసింది. ట్రాన్సపోర్టు గోదాం నుంచి, గుజరాత్ నుంచి ఈ ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఉత్తరప్రదేశ్ పోలీసులు నిర్ధారించారు. దేశంలో జరిగే అన్ని పేపర్ లీకేజీలకు గుజరాత్ కేంద్ర బిందువు అని అక్కడి రాజకీయ నాయకులే చెబుతుండడం విశేషం.

పశ్నాపత్రాలు సోషల్ మీడియాలో తొలుత రాగా, ఇది నకిలీ వార్త అంటూ యూపీ సర్కార్ కొట్టేసింది. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం దిగి రాక తప్పలేదు. సీబీఐ రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేసింది. దీంతో పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు పరీక్షను రద్ధు చేసి 48 లక్షల మంది అభ్యర్థులను తీవ్ర వేదన, ఒత్తిడికి గురి చేశారు.

ఇలా చెప్పుకుంటూ పోతే జమ్మూ కశ్మీర్ లో 5, హిమాచల్ ప్రదేశ్ 4, ఉత్తరాఖండ్ 4, పంజాబ్ లో ఒకటి, హర్యానా 6, రాజస్థాన్ 11, బిహార్ 6, అరుణాచల్ ప్రదేశ్ లో ఒకటి, అసోం 8, మణిపూర్ ఒకటి, జార్ఖండ్ 2, ఒడిశా 4, ఏపీ లో ఒకటి, తమిళనాడు 2, తెలంగాణ 4, కేరళ 2, కర్నాటక 7, మహారాష్ట్రలో 11 పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయి. ఇవన్నీ ఒక ఎత్తైతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వహించిన పలు పరీక్షల ప్రశ్న పత్రాలు కూడా లీకయ్యాయి.

2014 నుంచి ఇప్పటి వరకు 38 పేపర్ లీకేజీలు జరిగాయంటే ఎంత సమర్థవంతంగా పరీక్షలు నిర్వహిస్తున్నారో అర్థమవుతుంది. ఇందులో ఈ మధ్యకాలంలో విన్పిస్తున్నది నీట్ 2026 పేపర్ లీకేజీ. దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్ష కోసం 23 లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 97 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. గెస్ పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు భవితవ్యం గందగోళంగా తయారై మళ్లీ పరీక్షలు రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ గెస్ పేపర్ ను కనిష్టంగా రూ.30వేల నుంచి రూ. లక్షల వరకు డిమాండ్ ను బట్టి వేలం పెట్టి విక్రయించారు. నాగపూర్ కు చెందిన ఒక విద్యార్థి ఏకంగా రూ.28 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాడు. దీనిపై సీబీఐ దర్యాప్తు జరుగుతుండగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ లో సీజేపీ ఆధ్వర్యంలో పర్యావరణవేత్త, సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. సోమవారం చలో పార్లమెంటుకు పిలువు నివ్వడంతో, పోలీసులు ఆందోళనకారులను నిలువరించేందుకు లాఠీ ఛార్జ్, టియ్ గ్యాస్ ప్రయోగించారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏమాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

దేశాన్ని మేమే కాపాడుతున్నామని, మేమే అసలు సిసలు దేశ భక్తులం అని చెప్పుకునే పార్టీ ఏలుబడిలో 2017 లో ఇండియన్ ఆర్మీ రిక్రూట్ మెంట్ పరీక్ష పేపర్ లీకయ్యింది. 2016 లో నీట్ ఫేజ్ 1, ఫేజ్ 2 పేపర్లు కూడా లీక్ అయినా కేంద్రం కఠిన చట్టాలు చేయకుండా తాత్సారం చేస్తుండడం ఆందోళన కలిగించే అంశమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం సీబీఎస్ఈ 12వ తరగతి మూల్యాంకనంలో ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకున్నది. 2019 లో తెలంగాణలో ఇంటర్ విద్యార్థుల బలవన్మరణాలకు కారణమైన గ్లోబరీనీ టెక్నాలజీ (కో ఎంప్ట్ ఎడ్యుటెక్) సంస్థకు మూల్యాంకనం బాధ్యతను సీబీఎస్ఈ అప్పగించింది. 9.7 లక్షల మంది రాసిన ఈ పరీక్షలో 3.8 లక్షల మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. పాతిక మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్ స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకనానికి తనదే బాధ్యత అని విద్యా శాఖ మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ ప్రకటించారు కాని రాజీనామా చేయలేదు. ప్రతిపక్షాలు గొంతెత్తుతున్నా, దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా నిమ్మకు నీరెత్తని విధంగా మౌనం వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం గ్లోబరీనా టెక్నాలజీని బ్లాక్ లిస్టులో చేర్చగా, దాన్ని కో ఎంప్ట్ ఎడ్యుటెక్ గా మార్చి సీబీఎస్ఈ ఆన్ స్క్రీన్ మార్కింగ్ కాంట్రాక్టు దక్కించుకున్నది. ఈ సంస్థకు ప్రయోజనం కలిగేలా సీబీఎస్ఈ తన టెండర్ నిబంధనలనే మార్చుకోవడం మూలంగా లక్షలాది మంది సీబీఎస్ విద్యార్థులను నిద్రలేని రాత్రులకు గురిచేసింది.



వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## ఇక ఇంటర్నెట్ లేకున్నా యూపీఐ చెల్లింపులు
## సిగ్నల్ లేని చోట కూడా సులభంగా పేమెంట్స్!




దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో మరో విప్లవాత్మక మార్పు రాబోతోంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లోనూ సులభంగా యూపీఐ లావాదేవీలు జరిపేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఒక కొత్త ఫీచర్‌ను అభివృద్ధి చేస్తోంది. దీని ద్వారా యూజర్ ఫోన్, వ్యాపారి వద్ద ఉండే 'పాయింట్ ఆఫ్ సేల్' (పీఓఎస్) టెర్మినల్ రెండూ ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పటికీ, రూ.2,000 వరకు చెల్లింపులు చేయవచ్చు. ఈ సదుపాయాన్ని నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్‌ఎఫ్‌సీ) టెక్నాలజీ ఆధారంగా 'ట్యాప్-టు-పే' విధానంలో తీసుకురానున్నారు. ఈ కొత్త ఫీచర్ పనితీరుపై అందుతున్న సమాచారం ప్రకారం వినియోగదారులు ముందుగా తమ ఫోన్‌లో ఇంటర్నెట్ ఉన్నప్పుడు 'ఆన్-డివైస్ యూపీఐ లైట్ వ్యాలెట్'లోకి డబ్బును లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత, ఇంటర్నెట్ సిగ్నల్ లేని ప్రదేశాల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, తమ ఎన్‌ఎఫ్‌సీ ఆధారిత స్మార్ట్‌ఫోన్‌ను వ్యాపారి వద్ద ఉన్న సర్టిఫైడ్ ఆఫ్‌లైన్ పీఓఎస్ టెర్మినల్‌పై ట్యాప్ చేస్తే చాలు. ఎలాంటి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే లావాదేవీ పూర్తవుతుంది. ఈ లావాదేవీ వివరాలను పీఓఎస్ టెర్మినల్ తనలో స్టోర్ చేసుకొని, తిరిగి ఇంటర్నెట్ కనెక్టివిటీ వచ్చిన వెంటనే సెటిల్‌మెంట్ కోసం పంపుతుంది.

**-విమానాలు, మెట్రోల్లో నో టెన్షన్..**

ముఖ్యంగా విమానాలు, భూగర్భ మెట్రో స్టేషన్లు, మారుమూల గ్రామాలు వంటి నెట్‌వర్క్ సరిగా లేని లేదా అసలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈ ఫీచర్‌ను రూపొందిస్తున్నారు. దీనివల్ల ప్రయాణ సమయాల్లో, సిగ్నల్ సమస్యలు ఎదురయ్యే చోట్ల డిజిటల్ చెల్లింపుల విశ్వసనీయత, సౌలభ్యం గణనీయంగా పెరుగుతుంది. ఈ ఏడాది చివరి నాటికి ప్రముఖ తయారీదారుల నుంచి పీఓఎస్ టెర్మినల్స్‌కు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే ప్రక్రియను ఎన్‌పీసీఐ ప్రారంభించవచ్చని తెలుస్తోంది.

## కొత్త రంగుల్లో ఐఫోన్ 18 ప్రో- పెదవి విరుస్తున్న అభిమానులు!



ప్రముఖ దిగ్గజ టెక్ సంస్థ యాపిల్ త్వరలోనే విడుదల చేయనున్న ఐఫోన్ 18 ప్రో సిరీస్‌పై రకరకాల వార్తలు టెక్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. సెప్టెంబరులో అధికారికంగా లాంచ్ కానున్న ఈ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ డిజైన్, ఫీచర్లకు సంబంధించి లీకైన కొన్ని వివరాలు వినియోగ దారులను కొంతవరకు అసంతృప్తికి గురిచేస్తున్నాయి. ప్రత్యేకించి ఫోన్ మందం, బరువు, అందుబాటులో ఉండే రంగుల విషయంలో పలు ఊహాగానాలు బయటకు వచ్చాయి. లీకైన వివరాల ప్రకారం.. నయా ఐఫోన్ 18 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లు ప్రస్తుత ఐఫోన్ 17 ప్రో కంటే దాదాపు 2 మిమీ వరకు ఎక్కువ మందంతో ఉండే అవకాశముంది. ప్రముఖ టిప్‌స్టర్ల కథనం ప్రకారం ఈ ఫోన్‌ల మందం 10.75 మిమీ వరకు పెరగవచ్చు. అయితే, కొన్ని నివేదికలు కేవలం బ్యాక్ కెమెరా బంప్ పరిమాణం పెరగడం వల్లే ఈ వ్యత్యాసం కనిపిస్తుందని, ఫోన్ ప్రధాన బాడీ మందం 8.75 మిమీ మాత్రమే ఉంటుందని పేర్కొంటున్నాయి. మరో ప్రధాన మార్పు ఫోన్ బరువులో కనిపిస్తోంది. కొత్త ప్రో మ్యాక్స్ మోడల్ బరువు 240 గ్రాములకు చేరవచ్చని అంచనా. ఇది ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ (233 గ్రాములు) కంటే ఏడు గ్రామాలు ఎక్కువ. ఇప్పటికే చేతిలో పట్టుకోవడానికి బరువుగా ఉన్నాయనే విమర్శలు ఉండగా, కొత్త వెర్షన్ మరికొంత బరువు పెరగడం పట్ల వినియోగదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా, యాపిల్ ఐఫోన్ ప్రో సిరీస్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన 'బ్లాక్'కలర్ వేరియంట్‌ను ఈసారి నిలిపివేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దానికి బదులుగా డార్క్ చెర్రీ, లైట్ బ్లూ, సిల్వర్ రంగులలో మాత్రమే ఈ ఫోన్ లభించనుందని నివేదికలు చెబుతున్నాయి. ఒకవేళ ఇవే వార్తలు నిజమైతే, సన్నగా, తేలికగా ఉండే నలుపు రంగు ఐఫోన్ కోరుకునే వినియో గదారులకు ఇది కొంత ప్రతికూల వార్తగానే భావించవచ్చు. అయితే, యాపిల్ సంస్థ అధికారికంగా వెల్లడించే వరకు ఈ లీక్స్‌ను కేవలం అంచనాలుగానే చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వచ్చే నెల నుంచి పెరగనున్న మారుతి కార్ల ధరలు



దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా తమ వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. 2026 ఆగస్టు నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని, ప్యాసింజర్ వాహనాల ధరలు గరిష్ఠంగా రూ. 30,000 వరకు పెరగనున్నాయని మంగళవారం వెల్లడించింది. ముడిసరుకుల వ్యయం స్థిరంగా పెరుగుతుండటం, అధిక ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది. ఈ మేరకు బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్)కి సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో మారుతి సుజుకి ఈ వివరాలను పొందుపరిచింది. పెరిగిన ఖర్చుల భారాన్ని తగ్గించుకోవడానికి అంతర్గతంగా అనేక చర్యలు చేపట్టినా, తప్పనిసరి పరిస్థితుల్లో కొంత భారాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు వివరించింది."గత కొన్ని నెలలుగా వ్యయ నియంత్రణ చర్యల ద్వారా ఖర్చుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నించాం. అయినప్పటికీ, ద్రవ్యోల్బణ భారం అధిక స్థాయిలో ఉండటం, ప్రతికూల వ్యయ వాతావరణం కొనసాగుతుండటంతో, పెరిగిన వ్యయంలో కొంత భాగాన్ని మార్కెట్‌కు బదిలీ చేయక తప్పడం లేదు. అదే సమయంలో, వినియోగదారులపై దీని ప్రభావం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూస్తాం" అని మారుతి సుజుకి తమ ఫైలింగ్‌లో పేర్కొంది.

## రోహిత్ శర్మ ఎప్పుడు విఫలమవుతాడా అని చూస్తున్నారు: మహ్మద్ కైఫ్

ఇంటర్నెట్ డెస్క్:

రోహిత్ శర్మ రిటైర్‌మెంట్ వార్తలపై ఇంకా చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈ విషయంపై టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ రిటైర్‌మెంట్ నిర్ణయం అతడి చేతుల్లోనే ఉండాలని.. ఆ హక్కు అతడికి మాత్రమే ఉందని స్పష్టం చేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు ముందు రోహిత్ అంతర్జాతీయ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వచ్చాయి. 2027 వన్డే ప్రపంచకప్‌లో అతడు ఆడకపోవచ్చనే వార్తలు కూడా వినిపించాయి. అయితే లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో రోహిత్ తన పాత ఫామ్‌ను చూపిస్తూ 138 పరుగులతో మెరిశాడు. లార్డ్స్‌లో వన్డే సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. రోహిత్ శర్మ రిటైర్‌మెంట ఎప్పుడు తీసుకోవాలో రోహిత్ శర్మనే నిర్ణయించాలి. అతడికి ఆ హక్కు ఉంది. భారత క్రికెట్ కోసం అతడు ఎంతో కష్టపడ్డాడు. 12 వేల పరుగులు, 34 సెంచరీలు సాధించాడు. కెప్టెన్‌గా ఉన్నంతకాలం భారత్ ఓడిపోకుండా ఎంతో గొప్పగా నడిపించాడు. కూడా వైట్ బాల్ క్రికెట్‌లో రోహిత్ నాయకత్వంలో భారత్‌ను ఎవరూ ఓడించలేకపోయారు. కానీ ఇప్పుడు అతడిపై ఎంతో ఒత్తిడి ఉంది. 'రోహిత్ ఇక నీ పని అయిపోయింది.. రిటైర్‌మెంట్ తీసుకో' అంటూ చాలామంది మాట్లాడుతున్నారు. అలాంటి ఒత్తిడ ిలోనూ లార్డ్స్‌లో భారత బ్యాటర్లలో ఎవరికీ సాధ్యం కాని సెంచరీ అతడి బ్యాట్ నుంచి వచ్చింది' అని కైఫ్ పేర్కొన్నాడు.



**-రోహిత్ శర్మకు మద్దతు ఇవ్వాలి..**

'ఒకవేళ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 'రోహిత్ భాయ్, 2027 ప్రపంచకప్‌లో నాకు మీరు కావాలి' అని బహిరంగంగా చెబితే ఎలా ఉంటుంది? బీసీసీఐ కూడా 'రోహిత్‌పై ఎవరూ వేలెత్తి చూపొద్దు. అతడు ఎంత కాలం ఆడాలనుకుంటే అంతకాలం ఆడనివ్వండి. మేము అతడికి అండగా ఉన్నాం' అని ప్రకటిస్తే పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. ప్రస్తుతం రోహిత్ ఒత్తిడిలో ఉన్నాడు. ఎందుకంటే అతడి వెనుక ఎవరూ నిలబడటం లేదనే భావన ఉంది. అందరూ అతడు ఎప్పుడు విఫలమవుతాడా అని చూస్తున్నారు. కానీ జట్టు, కెప్టెన్, కోచ్ తనకు అండగా ఉన్నారని అతడికి నమ్మకం కలిగితే.. దేశం కోసం హిమాల యాలనైనా అధిరోహించేంత శక్తితో ఆడతాడు. అభిమానులకు ఓ విజ్ఞప్తి.. ఇక నుంచి అందరూ ప్రశాంతంగా ఉండండి. రోహిత్ శర్మను స్వేచ్ఛగా భారత జట్టు కోసం ఆడనివ్వండి' అని కైఫ్ వెల్లడించాడు.

## రోహిత్ శర్మ ఇప్పుడు కొత్తగా నిరూపించుకోవాల్సిన అవసరం లేదు: రవి శాస్త్రి

ఇంటర్నెట్ డెస్క్:

భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ రిటైర్‌మెంట్ పుకార్లపై క్రికెట్ దిగ్గజం రవిశాస్త్రి స్పందించాడు. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో 138 పరుగులతో చెలరేగిన సంగతి తెలిసిందే. వన్డే ఫార్మాట్‌లో రోహిత్ భవిష్యత్తుపై వస్తోన్న అనుమానాలకు ఈ ఇన్నింగ్స్ గట్టి సమాధానమని రవి శాస్త్రి పేర్కొన్నాడు. గత కొంతకాలంగా వన్డే ఫార్మాట్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలుకనున్నాడంటూ నెట్టింట వార్తలు జోరుగా ప్రచారం జరుగుతున్నాయి. 2027 ప్రపంచ కప్ ప్రణాళికల్లోనూ అతడికి స్థానం లేదని టీమ్ మేనేజ్‌మెంట్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రోహిత్ సెంచరీ చేసి అందరికీ బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడంటూ రవి శాస్త్రి వెల్లడించాడు.రోహిత్ శర్మ ప్రత్యేకంగా ఇప్పుడు నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. కానీ అతడిపై వస్తోన్న పుకార్లు, విమర్శలకు బ్యాట్‌తోనూ సమాధా నం చెప్పాడు. తన సెంచరీతో అందరి నోళ్లు మూయించాడు. అయినా ఇలాంటి పుకార్లు వస్తే కొన్నిసార్లు ఇబ్బందిగా ఉంటుంది. అతడికి ఇంకా ఆడాలనే కోరిక, ఆటపై ఆసక్తి, కష్టపడే తపన ఉంటే.. ఎంతకాలం కావాలంటే అంతకాలం ఆడే అవకాశం ఇవ్వాలి. ఒక రోజు రోహిత్ స్వయంగా జట్టును వీడేందుకు సరైన సమయం ఇదేనంటూ భావిస్తాడు. అప్పుడు మాత్రమే అతడు రిటైర్‌మెంట్ ఇవ్వాలి. ఇలాంటి నాణ్యమైన ఆటగాడిని జట్టు నుంచి తప్పించాలనుకునే సమయంలో అతడు ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం ప్రత్యేకం. లార్డ్స్‌లో వచ్చిన ఈ వన్డే సెంచరీ చాలా గొప్పది' అని శాస్త్రి ప్రశంసించాడు.




# క్రీడలు

## ఫిఫా విజేతలకు భారీ జాక్‌పాట్.. స్పెయిన్ ప్లేయర్లకు రూ.8.32 కోట్ల చొప్పున బోనస్!





ఇంటర్నెట్ డెస్క్:

ఫిఫా ప్రపంచ కప్ 2026 విజేతగా నిలిచిన స్పెయిన్ జట్టుకు భారీ జాక్‌పాట్ తగిలింది. జట్టులోని ప్రతి ప్లేయర్‌కు 7.56 లక్షల యూరోలు(సుమారు రూ.8.32 కోట్లు) బోనస్‌గా అందనున్నట్లు స్పానిష్ మీడియా వెల్లడించింది. ఫిఫా ఫైనల్‌లో అర్జెంటీనా జట్టుపై 1-0 తేడాతో గెలిచిన స్పెయిన్.. రెండోసారి ట్రోఫీని ముద్దాడిన సంగతి తెలిసిందే.ప్రపంచ కప్ విజేతగా నిలవడంతో ఫిఫా నుంచి స్పానిష్ ఫుట్‌బాల్ సమాఖ్యకు 50 మిలియన్ డాలర్లు(రూ.481 కోట్లు) ప్రైజ్ మనీ లభించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ప్రపంచ ఛాంపియన్ హోదాతో స్పాన్సర్‌షిప్ ఆదాయం, టెలివిజన్ ప్రసార హక్కుల విలువ కూడా గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం స్పెయిన్ జాతీయ జట్టుకు ప్రయాణం, బీమా, టెలికమ్యూనికేషన్, క్రీడా సామగ్రి, ఇంధనం, ఆహార, పానీయాల వంటి రంగాలకు చెందిన 35 సంస్థలు స్పాన్సర్లుగా ఉన్నాయి. ప్రపంచకప్ విజయంతో వీటి విలువ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.ఇక జట్టు అధికారిక జెర్సీల అమ్మకాలు కూడా భారీగా పెరిగాయి. ముఖ్యంగా స్పెయిన్ జెర్సీలు దేశవ్యాప్తంగా పూర్తిగా విక్రయాలు చేసినట్లు సమాచారం. విదేశాల్లోనూ వీటి డిమాండ్ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రైజ్ మనీతో పాటు ప్రతి ఆటగాడికి ప్రపంచ కప్ విజేత పతకం, ప్రత్యేక రింగ్ కూడా అందజేయనున్నారు.

VARTHAA SAKSHAMU వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక Editor : SAGINALA RAVI KUMAR

# ‘టాక్సిక్’ నుంచి రెండో పాట యశ్-తారా రొమాన్స్‌తో ‘మనసు ఆగదు’!








రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘టాక్సిక్’ విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం రెండో పాట ‘మనసు ఆగదే’ను విడుదల చేసింది. ఇప్పటికే వచ్చిన తొలి పాట ‘తబాహి’తో బోల్డ్ రొమాంటిక్ టోన్‌ను చూపించిన మేకర్స్.. ఇప్పుడు రెండో పాటలో అంతకుమించిన రొమాన్స్‌ను ఆవిష్కరించారు. ఈ పాటలో యశ్, బాలీవుడ్ నటి తారా సుతారియా మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాత్‌టబ్‌లో తారా ఎంట్రీ, ఆమెకు యశ్ గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్, వర్షంలో ఇద్దరి రొమాంటిక్ మూమెంట్స్, కేఫ్‌లో ముద్దులతో సాగే సన్నివేశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రెండో పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.




## సరికొత్త బిజినెస్ ప్రారంభించిన నటి సాక్షి అగర్వాల్!




దక్షిణాది సినీ పరిశ్రమలో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాక్షి అగర్వాల్, ఇప్పుడు వ్యాపార రంగంలోకి అడుగుపెడుతూ తన ఐదేళ్ల కలను నిజం చేసుకున్నారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని ‘ఓకూ’ పేరుతో ఒక ప్రీమియం పెర్ఫార్మెన్స్ న్యూట్రిషన్ కంపెనీని ఆమె అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి లోనైన సాక్షి, ఈ బ్రాండ్ రూపుదిద్దుకోవడానికి తాను గత ఐదేళ్లుగా నిరంతరం పరిశోధనలు చేస్తూ, ఉత్పత్తుల నాణ్యత విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అత్యుత్తమ నాణ్యత కలిగిన పోషకాహార ఉత్పత్తులను అందించడమే తన ప్రధాన ధ్యేయమని ఆమె తెలిపారు. మార్కెట్లో చాలా న్యూట్రిషన్ బ్రాండ్లకు సినీ ప్రముఖులు కేవలం అంబాసిడర్లుగా మాత్రమే పరిమితమవుతారని, కానీ తాను శ్రమించి స్థాపించిన ఈ సంస్థకు తానే స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం ఎంతో గర్వంగా ఉందన్నారు. వరుస షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతోనే ఈ సంస్థను ప్రారంభించినట్లు వివరించారు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, తమిళంలో ‘రాజా రాణి’, ‘కాలా’, ‘విశ్వాసం’, ‘సింద్రెల్లా’, ‘టెడ్డి’, ‘అరణ్మనై 3’ వంటి హిట్ సినిమాల్లో నటించి, ‘బిగ్‌బాస్ తమిళ్’ ద్వారా విశేష ప్రజాదరణ పొందిన సాక్షి, ఇప్పుడు బిజినెస్ ఉమెన్‌గా కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. నటిగా అలరిస్తూనే వ్యాపారవేత్తగా కూడా విజయం సాధించాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## ఐశ్వర్యలో ఆ అణకువే నచ్చుతుంది జయా బచ్చన్ పాత వ్యాఖ్యలు వైరల్

బాలీవుడ్ నటి, మాజీ విశ్వసుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్‌పై ఆమె అత్త, సీనియర్ నటి జయా బచ్చన్ గతంలో కురిపించిన ప్రశంసలు మరోసారి వార్తల్లో నిలిచాయి. తన కోడలు ఐశ్వర్య తమ కుటుంబంలో ఎంత అన్యోన్యంగా కలిసిపోయారో, అంతటి స్టార్‌డమ్ ఉన్నప్పటికీ ఆమె ఎంతటి అణకువతో ఉంటారో జయా బచ్చన్ ఒక సందర్భంలో వివరించారు. దీనికి సంబంధించిన పాత వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కరణ్ జోహార్ నిర్వహించే ప్రముఖ చాట్ షో ‘కాఫీ విత్ కరణ్’లో పాల్గొన్న సందర్భంగా జయా బచ్చన్ ఈ వ్యాఖ్యలు చేశారు. “ఐశ్వర్య చాలా మంచి మనసున్న వ్యక్తి. ఆమెకు నా పట్ల ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయి. తను కూడా పెద్ద స్టార్ అయినప్పటికీ, మేమంతా కలిసి ఉన్నప్పుడు ఎప్పుడూ తన హోదాను ప్రదర్శించుకోదు. ఎంతో హుందాగా ఉంటూ, ఇతరుల మాటలను నిశ్శబ్దంగా వింటుంది. ఆమెలోని ఈ గుణం నాకు ఎంతగానో నచ్చుతుంది,” అని జయ కొనియాడారు. కేవలం కుటుంబ సభ్యులతోనే కాకుండా, తమ స్నేహితులతో కూడా ఐశ్వర్య ఎంతో సాన్నిహిత్యంగా మెలుగుతారని జయ ఆనందం వ్యక్తం చేశారు. ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల వివాహం 2007 ఏప్రిల్ 20న జరిగిన విషయం తెలిసిందే. వీరికి 2011లో ఆరాధ్య అనే కుమార్తె జన్మించింది. ‘కుచ్ నా కహో’, ‘ధూమ్ 2’, ‘గురు’, ‘రావణ్’ వంటి పలు చిత్రాల్లో అభిషేక్, ఐశ్వర్య కలిసి నటించారు.



## చరణ్ సరసన రష్మిక?- సుకుమార్ స్కెచ్ మామూలుగా లేదుగా!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం ‘ఆర్‌సీ17’ (వర్కింగ్ టైటిల్)పై సినీ వర్గాల్లో అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన ‘రంగస్థలం’ ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం, ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో ‘పుష్ప’ ఫ్రాంచైజీ సినిమాలు చరిత్ర సృష్టించడం నేపథ్యంలో... ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమాని త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మొదట కియారా అద్వానీ పేరు వినిపించినా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న పేరు బలంగా వినిపిస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ‘పుష్ప’ సిరీస్‌తో రష్మిక పాన్-ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఆ చిత్రంలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు ‘ఆర్‌సీ17’ కోసం సుకుమార్ ఒక బలమైన, కథను మలుపు తిప్పే మహిళా పాత్రను రాసుకున్నారని, ఆ పాత్రకు రష్మిక అయితేనే పూర్తి న్యాయం చేయగలదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఆమెకున్న పాన్-ఇండియా ఇమేజ్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథాగమనంలో అత్యంత కీలకంగా ఉండనుందని తెలుస్తోంది. చరణ్ మాస్ ఇమేజ్, సుకుమార్ టేకింగ్, దానికి రష్మిక నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ‘రంగస్థలం’తో రికార్డులు సృష్టించిన ఈ కాంబో, మరోసారి అంతకుమించిన విజయాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, హీరోయిన్ ఎంపికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు రష్మిక ప్రస్తుతం తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి ‘రణబాలి’ అనే భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 19వ శతాబ్దంలో రాయలసీమలో కరవు సమయంలో బ్రిటిష్ పాలనపై పోరాడిన ఓ యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. ‘గీత గోవిందం’, ‘డియర్ కామ్రేడ్’ తర్వాత విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.





PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.